# గుండెకరాయి, వజ్రపుతునక

ప్రవక్తల...పోర్టికోలోకి కారాగింది.

లోపల ... సెంట్రల్‌హాల్లో 'తిరణాల' జరుగుతోంది.

కారుడోర్ బ్యాంగయిందవతల.

'తిరణాల' హఠాత్తుగా స్తంభించి పోయింది లోపల. కారు దిగి చకచక మెట్లెక్కాయ్ రెండు శాల్తీలు; వరండా మీద టకటక చప్పుడు చేసుకుంటూ దగ్గిర పడుతున్నాయ్ అవి.

ఆ చకచకలోని శ్రుతి...

ఆ టకటకలోని లయ...

ఆ శ్రుతి లయాదుల రిథం అంతా వాళ్ళ కానమాలే రెణ్నెల్లనుంచీ.

వచ్చి గంటయినా, ఒక్క ఫైలయినా ముట్టకుండా, సెంట్రల్ హాల్లో, గుమిగూడి తీరిగ్గా 'తిరణాల' జరుపుకుంటూన్న 'పెద్దలు' పిల్లులై చడీ చప్పుడూ లేకుండా ఒక్క వురుకు వురికారు ఎవరి సీట్లలోకి వాళ్ళు.

సెంట్రల్ హాలును చేర్చి, వరండా మీద కుడిప్రక్కగా వున్న గది ముందు టకటక శబ్దం క్షణంపాటు ఆగింది.

స్వింగ్‌డోర్ తెరచుకుంది, అదృశ్య హస్తం లోపలినుంచి పట్టి లాగగా.

గదిలో సీలింగ్‌ఫ్యాన్ తిరుగుతోంది.

టేబిల్లైటు వెలుగుతోంది.

గదిముందాగిన శాల్తీలు కదిలాయ్.

మళ్ళీ టకటక చప్పుడు.

జరుగుతూన్న 'తిరణాల' కడ్డొచ్చిన నల్ల బూటు కాళ్ళు సెక్రటేరియట్ టేబిల్ కిందున్న ఫుట్‌రెస్టు మీద ఆనుకున్నాయ్.

కాలింగ్‌బజ్జర్ గర్రుమంది, గుమ్మం దగ్గిర.

స్వింగ్‌డోర్ కిర్రుమంది.

నెత్తిమీద తలపాగా, మోకాళ్ళ దగ్గర్నుంచీ పీకల్దాకా గుండీలు బిగించుకున్న లాంగ్‌కోటూ లోపలికి తొంగి చూశాయ్, స్టూలు దగ్గర్నుంచే.

కుర్చీలో నెక్-టై ముడి కొంచెం కిందికి దిగజారుతోంది.

"హెడ్‌క్లార్క్ గోవిందసామిని పిలు!"


గొంతులోంచి అధికారస్వరం గంభీరంగా ధ్వనించింది.

తలపాగా తరలి వెళ్ళింది.

హవాయ్ చెప్పులూ, అమావాశ్య చీకటి ప్యాంటూ, పున్నమివెన్నెల బుష్షర్టూ...

''సార్!''

అవసరాల నారాయణరావు




ఉరుకుతూ వచ్చి నించున్నాడు మూడు మూర్తులూ.

"రాజ్యంసీటు యిన్‌స్పెక్షన్ చేస్తాను. రికార్డ్సన్నీ పట్టుకు రమ్మనండి! యూ–ఆల్సో–కమ్!"

"యస్సర్!"

హవాయ్‌చెప్పులు మడమలకు టప్ టప్ మని కొట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

రివాల్వింగ్ చెయిర్‌లో వెనక్కు ఒరిగాడు రాజగోపాల్. పెదవులమధ్య వేలాడుతూన్న సిగరెట్టు చివరిభాగం బూడిదకట్టింది. సిగరెట్టు పక్కనుంచి, పెదవుల సందుల్లోనుంచి వస్తోన్న పొగ మబ్బులా విడిపోతోంది.

చాటంత మొహం చేసుకుని. తన గదిలోకి చకచక వెళ్ళిపోతూన్న గోవిందసామిని చారిడేసికళ్ళు చేసుకుని, సెంట్రల్ హాల్లోవాళ్ళంతా పట్టి పట్టి చూశారు.

ఎప్పుడూ మొహం ముడుచిపెట్టుకుని, ధుమ ధుమ లాడుతూ, ఎవరిమీదో ఒకరిమీద, ఎందుకో ఒహందుకు నిత్యమూ సణుగుతూవుండే నసమనిషి యీవేళ యింత హుషారుగా, కులాసాగా వుండటానికిగల కారణం ఏమై వుంటుందా అని అందరూ ఆలోచించసాగారు; కాని, ఎవరికీ అంతుపట్టలేదు.

రాజ్యం అంటే గోవిందసామికి ఎందుకోగాని ప్రత్యేకాభిమానం! అందుకనే. బాస్ ఆమెసీటు యిన్‌స్పెక్షన్ చేస్తానంటే ఎక్కళ్ళేని సంబరం తనలో ముమ్మరంగా ముంచుకొచ్చింది. ఆ స్వర్ణావకాశం కోసం ఎన్నిరోజులుగానో కలలు గంటున్నాడు; కళ్ళు కాయలుకాచిపోయేలా చూస్తున్నాడు. ఆ శుభతరుణానికి యీవేళ అరుణోదయం అయింది!

'ఈవేళ పెద్ద పండగ! రాత్రి, మంచి నాన్‌వెజిటేరియన్ హోటల్‌కు

పోయి, స్పెషల్ డిన్నర్‌కి ఆర్డరు చెయ్యాలి. ఓ బ్రాందీ బోటిల్ ఖాళీ చెయ్యాలి. ఇహ ఆతర్వాత అయిదో, పదో పారేసి ఘుమఘుమలాడే స్పెషల్ పాన్ ఒహటి బుగ్గన బిగించి, మాంచి రిక్షావాణ్ని చూడాలి. ముందుగానే వాడి చేతిలో మూడో నాలుగో పెట్టి, "ఒరేయ్ అబ్బీ:...ఆడదిక్కూ లేనివాణ్ని! ముద్దుకీ ముచ్చటకీ మొహం వాచినవాణ్ణి! నువ్వు ఏ వీధికి తీసికెళ్ళితే, ఆ వీధి కొస్తాను; ఏ గడప దగ్గిర దిగమంటే ఆ గడప దగ్గిర దిగుతాను!' అనాలి — అలా కలలు గంటూ రాజ్యం సీటుదగ్గరకు వెళ్ళాడు గోవిందసామి.

తల వంచుకుని, రాజ్యం ఏదో డ్రాఫ్ట్ వ్రాసుకుంటోంది.

"చూడండి!...మీ సీటు యిన్‌స్పెక్షన్ చేస్తారట బాస్ యిప్పుడు. మీ రికార్డ్సన్నీ కట్టకట్టి ఫ్యూన్ చేత పట్టించుకు పదండి."

లోలోపల పడుతూన్న సంబరం బయటపడకుండా, గోవిందసామి మొహం గాంభీర్యం దాల్చింది.

"ఇన్‌స్పెక్షనా!?..." ఆశ్చర్యంతో తలెత్తి చూసింది, వ్రాసుకుంటూన్న రాజ్యం. "వెళ్ళిపోయిన బాస్ డిశంబరులోనే కదా చేసి వెళ్ళిపోయాడు. రెన్నెల్లయినా యింకా అవ్వలేదు. అప్పుడే మళ్ళీ యిన్‌స్పెక్షనా?"

"అది ఆయన యిష్టం. మీరూ నేనూ ఎవరం చెప్పటానికి?...ఆర్గ్యూ చెయ్యక...ముందు పదండి!...అసలే ఆయన మండిపడుతున్నాడు;" చిరుబురులాడుతూ, అధికార స్వరంతో అన్నాడు గోవిందసామి.

అయినదానికీ, కానిదానికి 'యింకేం వుంది! ... బాస్ అగ్నిపర్వతంలా బద్దలై నిప్పులు కురిపిస్తున్నాడనీ, ఆకాశం విరిగి మీద పడేలా అరిచి పారేస్తున్నాడనీ...' యిలా చెప్పి, తన కిందవాళ్ళను హడలి చావగొట్టడం, 'యీ గోవిందసామి గనుక ఆయన్ని నెగ్గుకొస్తున్నాడు కానీ, యింకొహడైతే ఎప్పుడో యింటికి పోయేవాడు!' అన్న భావాన్ని అందులో స్ఫురింపచేసి తన ఆధిక్యతను చాటుకోవటం — గోవిందసామికి అయిదేళ్ళక్రితం అబ్బిన విద్య!

గోవిందసామి 'విద్య' ప్రభావం యించుమించు ఆఫీసులో వున్న వాళ్ళందరి మీదా అంతో యింతో పడుతుంది; అందులో ముఖ్యంగా తన సెక్షన్‌లో వాళ్ళమీద. కబోచ్చి, అణువంతకూడా చలించనిది రాజ్యం ఒక్కర్తే ఆ ఆఫీసు మొత్తంమీద. సముద్రంలో చినుకులు పడితే ఎంతో. గోవిందసామి మాట అంత ఆమెకు!

"సరె, చెయ్యనీండి! ఇప్పుడేం పోయిందీ? ఒకటికాకపోతే పది చేసుకో నివ్వండి. లొసుగు లేమైనా వుంటేగా భయపడటానికీ?" ధైర్యంగా సహా

ధానం చెప్పి, చటుక్కున సీట్లోంచిలేచి, డ్యూటీలిస్టూ, యితర రిజిస్టర్లూ, పీరి యాడికల్ రిటరన్సూ వగైరా అన్నిం టినీ ఒహదానిమీద ఒహటి పేర్చి, ప్యూనును పిలిచి, బాస్‌రూమ్‌లోకి పట్టుకు పద, అంది.

అవన్నీ పట్టుకుని వాడు,

వాడివెనక తనూ.

"ఇవన్నీ మోయించు కెడుతున్నా రేవిఁటండీ?" సెంట్రల్‌హాల్లో ఎవరో ఓ గుమాస్తా ఆశ్చర్యంగా అడిగాడు రాజ్యాన్ని.

"ఇన్‌స్పెక్షన్ టండీ!"

"ఇప్పుడేవిఁ ఇన్‌స్పెక్షనూ, ఎటూ కాని సీజన్లో?"

"ఇది ... స్పెషల్ ఇన్‌స్పెక్షన్ లెండి!"

సెంట్రల్‌హాల్లో 'బీ' 'సీ' సెక్షన్ వాళ్ళంతా అర్థంగాక ఒకరి మొహాఁల్లోకి ఒకరు చూసుకున్నారు.

సాధారణంగా, ప్రతీ ఆఫీసరూ తన ఆఫీసును సంవత్సరాంతంలో, ఆఖరి ఘడియల్లో ఏదోయింత మొక్కుబడి ఇన్‌స్పెక్షన్ చేసి, ఇన్ని పేజీలు విధిగా నలుపు జేసి, ఇదిగో నోట్సుని పైవాళ్ళ మొహాఁన వేసికొట్టటం పరిపాటి.

కాని యీ కొత్త బాస్ యింత హఠాత్తుగా, సంవత్సరారంభంలోనే! ఇన్‌స్పెక్షన్ టేకప్ చెయ్యటం, అందులో ప్రత్యేకంగా రాజ్యంసీటే తీసుకోవటంలో వుండే ఆంతర్యం ఎవరికీ అంతుపట్ట లేదు.

"గుడ్‌మార్నింగ్ సర్!"

బాస్‌రూమ్‌లో ప్రవేశిస్తూనే, వినయంగా విష్ చేసింది రాజ్యం.

రాజగోపాల్ కూడా ప్రతిగా విష్‌చేసి, "ప్లీజ్ సిడౌన్!" అన్నాడు, ఎదురుగా వున్న కుర్చీ చూపిస్తూ.

ఆ గదిలో ఒక్క కుర్చీయే వుంది. అంతకుముం దెప్పుడూ రెండుకుర్చీ లుండేవి విజటర్సుకోసం అని. కాని, ఆవేళ మాత్రం ఒహటే వుంది. అందులో తనను కూర్చోమంటున్నాడు బాస్. ప్రక్కన తన సెక్షన్ హెడ్ గోవిందసామి నించునివుండగా తను కూర్చోవటం ఏం బావుంటుంది?

రాజ్యం కాస్సేపు తటపటాయించి, "ఫరవాలేదు, నించుంటాను సర్!" అంది 'మీరు కూర్చోండి!' అంటు న్నట్లు గోవిందసామి మొహంలోకి చూసింది.

"ఐ ... సే ... సిడౌన్!"

రాజ్యం తటపటాయించటాన్ని గమనించిన రాజగోపాల్ కొంచెం గొంతు స్థాయి హెచ్చించి కరకుతనం మేళవించి గంభీరంగా మొహం పెట్టి అన్నాడు.

ఇహ విధిలేక, కుర్చీలో కూర్చుంది రాజ్యం.

చేతుల్ని వెనక్కు కట్టుకుని, టేబిల్ను

అనుకుని నించున్న గోవిందసామికి కడుపు మండిపోతూంది

తనను నించోబెట్టి. తన సబార్డినేట్‌కు సీటిచ్చి కూర్చోమన్నందుకు తలతీసేసిన ట్లనిపించింది గోవిందసామికి.

"మీరు డీల్ చేస్తూన్న సబ్జక్టు ఏవేం విఁటి ?"

మాట్లాడుతూన్నప్పుడు, రాజగోపాల్ పెదవుల అంచులమీద వ్రేలాడుతూన్న క్యాప్‌స్టన్ సిగరెట్టు, నర్తకి నృత్య భంగిమలో కదుల్తోంది. మాటలూ. పొగా — చేయీ చేయీకలిపి నడుస్తూన్న ఆలూ మగలులా — ఒకటై కలిసి వస్తున్నాయ్.

"డ్యూటీ లిస్టులో యిచ్చానండీ ఆ వివరాలన్నింటినీ !"

"లెట్మీ...సీ...దట్ !"

రాజగోపాల్ వదిలిన సిగరెట్టుపొగ చిన్న చిన్న మేఘాల్లా ఎదురుగా కూర్చున్న తనవైపు వస్తున్నాయేమో— ఆ పొగ గిట్టక, కుర్చీలో కొంచెం వెనక్కు ఒరుగుతూ, మొహం ముందు పొగను చేత్తో తోలుకుంటోంది రాజ్యం.

అది గమనించిన రాజగోపాల్, "అయామ్ — వెరీ — సారీ !" అని. చేతిలోవున్న సిగరెట్టును వెంటనే ప్రక్కనే వున్న 'యాష్ ట్రే'లో పారేశాడు.

తెల్లకాగితం మీద పైన తన పేరూ, ఆ సీట్లోకి తను ఏ తారీఖున వచ్చినదీ, తనకు ముందు ఎవరెవరు ఏ తేదీనుంచి ఏ తేదీ వరకు పనిచేసినదీ, వాటి క్రింద వరుస నంబర్లతోసహా, తను ఏ ఏ సబ్జక్టులు డీల్ చేస్తూన్నదీ వర్గైరా వివరాలను యిస్తూ, నీటుగా వరుసక్రమంలో టైపుచేసి అట్టమీద అంటించబడి వున్న డ్యూటీ లిస్టును తీసి బాస్‌ముందు పెట్టింది రాజ్యం.

"యూ — ఆర్ — యల్డీసీ — ఆర్ — యూడీసీ ?''

తనముందు డ్యూటీలిస్టును పెడుతూన్న రాజ్యం మొహంలోకి చూస్తూ అడిగాడు రాజగోపాల్.

ముందు ఆశ్చర్యపోయినా, మరుక్షణంలో మళ్ళీ సమాధాన పరుచుకుంది రాజ్యం. 'ఈ ఆఫీసర్లకు ఎప్పటికప్పుడే పరగడుపు. రెణ్నెల్లనుండి తనక్రింద పనిచేస్తున్నా, యింకా యల్డీసీవా, యూడీసివా అని అడుగుతున్నా డీయన ! ఏమనుకోవాలి ?'

"యల్డీసీయేగాని. యీ యూడీసీసీట్లో సంవత్సరంనుంచి పనిచేస్తున్నాను."

"హ్వా...ట్ ! ?'' ఎలక్ట్రిక్ షాక్ తిన్నవాడిలా అయిపోయాడు రాజగోపాల్. అంతవరకూ టేబిల్‌మీదకు ఒరిగి డ్యూటీ లిస్టును తనముందుకు సరిగ్గా లాక్కుంటూన్న వాడల్లా ఒక్కసారిగా కుర్చీలో వెనక్కు వాలిపోయి, ఆగ్రహాశ్చర్యాలతో గోవిందసామి మొహంలోకి గంభీరంగా గుచ్చి గుచ్చి

చూశాడు. "ది — సీజ్ — రియల్లీ — వండ్రఫుల్, మిస్టర్ హెడ్ క్లార్క్ !''

ఏకారణం చేతనైనా, ఆఫీసులో ఎవరిమీదయినా ఆగ్రహం వస్తే, ఎంత సన్నిహితుణ్ని అయినాసరే, పేరుతో సంభోధించటం రాజగోపాల్‌కు అలవాటు.

''యస్సర్ !... ప్రతినెలా మన స్టాఫ్ డిస్పొజిషన్ స్టేట్‌మెంటులో ఆ వేకెన్సీ చూపిస్తూనే వున్నాం సార్ !''

అది గోవిందసామి జవాబు.

''హ్వాట్ నాన్‌సెన్స్ !... పుటప్ — ఏ — డీవో — లెటర్ యిమ్మీడియట్లీ ?''

ఉరిమాడు రాజగోపాల్.

"యస్సార్ !''

భోజనానికి మజ్జిగా అన్నం ఎలా ఆఖరి అయిటమో, గోవిందసామి వాక్యానికి 'సార్ !' అన్న వూతపదం అలాంటిది.

బాస్‌తో చర్చిస్తున్నా, సబార్డినేట్సుతో తర్కిస్తున్నా, ఆఫీసుకు పనిమీదవచ్చిన పార్టీలతో ముచ్చటిస్తున్నా.... 'కొత్త ఆర్డర్సు ప్రకారం మనం చేసింది కరక్టే సార్ !' నేను చెప్పిన డ్రాఫ్టు రాసేరా సార్ !?' 'మీరు రిఫండుకోసం వచ్చారా సార్ ?'... యిలా యీ 'సార్'ను తన నోటికల్వంలో ఆయుర్వేద మందుల్లా కాటుకలా నూరి పారేస్తాడు.

రాజ్యం ఆసీట్లోకి వచ్చిన కొత్తలో చచ్చేవాడు; అలవాటుగా 'సార్' అన్న వూతపదాన్ని ఆమె మీదకూడా ప్రయోగించేసేవాడు. తరువాత నాలిక కొరుక్కునేవాడు. జేబు రుమాలు అడ్డు పెట్టుకుని నవ్వుకోలేకచచ్చేది. రాజ్యం.

"ఆఫీసుల్లో ఈ ఆడాళ్ళను వేసుకుంటే యిదొక్కటే యిబ్బంది," అని గొణుక్కునేవాడు. పోయిన బాస్‌ను పట్టుకుని కోరి రాజ్యాన్ని తన సెక్షన్లో వేయించుకున్న సంగతి మర్చిపోయి.

సంభోదనలో లింగ భేదా లుండటం గోవిందసామికి సుతరామూ యిష్టం లేదు. అబాలగోపాలానికీ 'సార్' అన్న ఒకేపదం వర్తించేలా వుండా లంటాడు. అవును మరి. ఆ 'సార్' అన్న పదం ఏ ప్రయాసా లేకుండా ఆటోమాటిక్‌గా ఎంత హాయిగా, ఎంత సుఖవుగా — ప్రింటింగ్ ప్రెస్‌లో రెండు రోలర్ల మధ్యనుంచి ఇవతలి ప్రక్కకు జారిపడే న్యూస్ పేపర్లా — దానంతటది జారి పోతుందనీ !

"వన్... టూ... త్రీ... హో ! గాడ్ !... ట్వెంటీ !... ఇన్ని సబ్జక్ట్సు ఒక్కరు డీల్ చెయ్యటం అంటే, క్వైట్-ఏ-డిఫికల్ట్ — జాబ్ !... మానేజ్ చెయ్యగలుగుతున్నారా మీరూ ?''

డ్యూటీ లిస్టులోవున్న అయిటమ్సు అన్నింటినీ వరుసగా లెక్కపెట్టి, ఆశ్చర్యార్ధకంగా రాజ్యం మొహంలోకి పరీక్షగా చూశాడు రాజగోపాల్.

రాజ్యం ఏదో చెప్పబోయింది.

అంతలో గోవిందసామి అడ్డు తగిలాడు.

"పేరుకి యిరవై కాని సార్..." అని నానుస్తూ.

"అయామ్ - నాట్ - ఆస్కింగ్యూ - 'సార్ !'... యూ-కీప్-క్వయట్."

ఎఱ్ఱగుడ్డని చూస్తే, ఎద్దు ఎలా ఎగిరిపడుతుందో, 'సార్' అన్న పదం అలగా వాడితే అంత ఎగిరిపడుతాడు రాజగోపాల్.

గోవిందసామితో, 'సార్ల'తో విసిగి వేసారిపోయిన రాజగోపాల్ గుడ్లురుముతూ అతడివంక కొరకొరా చూశాడంటే-చూడ్డూ మరీ!

గోవిందసామిని పట్టుకుని తనముందు ఆయన అలా అలా దులిపిపారేస్తూంటే ఒకప్రక్క సంబరం యింకోప్రక్క గోవిందసామి మీద జాలీ వేశాయ్ రాజ్యానికి.

"యస్!... చెప్పండీ!... మీ సీటు హెవీ అనిపించటం లేదు మీకూ?"

రాజ్యంవైపు తిరిగన్నాడు రాజగోపాల్ "టెన్-టూ-ఫైవ్ టైటు వరక్కుంది...... దానికి గవర్నమెంటు జీతం యిస్తూనే వుంది."


రాజగోపాల్ విస్తుబోయాడు.

తన పదహారేళ్ళ గెజిటెడ్ సర్వీసులో కొన్నివందల ఆఫీసుల్లో పని చేశాడు. కొన్నివేలమంది గుమాస్తాలను చూశాడు. వాళ్ళవాళ్ళ మనస్తత్వాలను బాగా ఆకళింపుచేసుకున్నాడు. కాని, ఎక్కడా ఎవరి నోటా యిలాంటి హుందా అయిన సమాధానం వచ్చిన పాపాన పోలేదు. చేతినిండా తగినంత పనిలేక, గోళ్ళు గిల్లుకుంటూనో, ప్రక్కవాడితో గప్పాలు కొట్టుకుంటూనో కూర్చునే వెధవ కూడా 'యింకేం వుంది! ... చచ్చిపోతున్నాను!...యీ రెండు సబ్జక్టులూతీసి వీడికంటకట్టండి!... ఆ నాలుగు రిటరన్సూలాగి వాడిమొహాన తగలెయ్యండి!' అని ఏడ్చేవాడేకాని, రాజ్యంలా వున్నదున్నట్లుగా, నిజాయితీగా, తనను పోషిస్తూన్న ప్రభుత్వానికి 'లాయల్'గా చెప్పిన వెధవ ఒక్కడు కనిపించలేదు

రాజగోపాల్ సంభ్రమాశ్చర్యాలకు అంతులేదు.

పెళ్ళయిన పదేళ్ళకు తొలి కాన్పులో పెళ్లాం కొడుకుని కన్నప్పుడూ, అనుకోకుండా తనకు అవుటాఫ్ టరన్ ప్రొమోషను వచ్చినప్పుడూకూడా తను అంత సంబర పడలేదు!

"హ్వెరీగుడ్!... హ్వెరీగుడ్!... నీలాంటి ఆదర్శప్రాయులైన సిబ్బంది కావాలి దేశానికి; నీకు వెంటనే అవుటాఫ్ టరన్ ప్రొమోషన్ ఇవ్వవలసిందిగా డైరక్టరుకు స్పెషల్ రిపోర్టు పంపిస్తూ 'బి' సెక్షన్‌లో వేస్తున్నాను నిన్ను, ఆ సెక్షన్ చాలా ఎరియర్స్‌లో వుంది. ఆ సెక్షన్‌లో పనిచెయ్యటానికి నీకేమైనా అభ్యంతరం వుందా అమ్మా?"




అంతవరకూ రాజ్యాన్ని 'మీరు' 'మీరు' అని బహువచనంలో మన్నిస్తూన్న రాజగోపాల్ గొంతులోంచి అప్రయత్నంగా ఏకవచన ప్రయోగం వెలువడింది.

మానవ హృదయపు అట్టడుగు లోతుల్లో అవ్యాజమైన భక్త్యనురాగాలు కాని, గౌరవాభిమానాలు కాని వుత్పన్నమైనప్పుడు, అంతర్గతమైన ఆ అనుభూతుల తాలూకు పారవశ్యం వాడిన పదాల్లో వాటిని వాడిన తీరులో తొణికిసలాడటం సహజం!

భక్తి పారవశ్యంలో "ఎక్కడున్నావురా ఏడుకొండలవాడా!?" అని ఏకవచన ప్రయోగం చేసి సంబోధించటం లేదూ వేంకటేశ్వరస్వామి అంతటివాణ్ణి!

"ఎవరబ్బ సొమ్మనుకున్నావురా రామా?" అని భక్తరామదాసు పట్టాభిరాముణ్ణి పట్టుకుని భక్తి పరిభాషలో తిట్టలేదూ?

అలాంటి హార్దికమైన గౌరవాభిమానాల అనుభూతే రాజగోపాల్ ఏకవచనప్రయోగంలో తొణికిసలాడింది.

ఆ ఏకవచన సంబోధనలో, 'అమ్మా!' అన్న పదప్రయోగంలో కండలు కరిగించి పోసే పనివాడిమీద యజమానికుండే గౌరవాదరాభిమానాలూ, బిడ్డమీద కన్నతండ్రికుండే ప్రేమ వాత్సల్యాలూ తొణికిసలాడాయి.

ఆయన ప్రసంశకూ, ఆప్యాయతకూ రాజ్యం కళ్ళు, అప్రయత్నంగా చెమర్చాయి!

కుంపటిమీద మరుగుతూ మరుగుతూ విరిగిపోతూన్న పాలలా అయిపోయింది గోవిందసామి మొహం :

“నా ఆత్మగౌరవానికీ, శీల పవిత్రతకూ భంగం వాటిల్లనిచోట ఎక్కడైనా పనిచేస్తాను; ఎవరితోనైనా సహకరిస్తాను.''

రాజ్యం అన్న మాటలతీరులో ఏదో ప్రత్యేకమైన గాంభీర్యం ద్యోతకమయింది.

గోవిందసామి గుండెలు వేగంగా కొట్టుకోవటం మొదలెట్టాయ్ !

“ఐ...సీ?...'' రెండక్షరాలనూ ఒత్తి ఒత్తి దీర్ఘంగా పలుకుతూ, సాలోచనగా తల పంకించాడు రాజగోపాల్.

“ఇహ నువ్వు వెళ్ళమ్మా !”

“థాంక్యూ సర్ !'' కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించి లేచి వెళ్ళిపోయింది రాజ్యం.

ఆమె అలా గుమ్మం దాటి, యిలా వెళ్ళిపోయిందో లేదో, రివాల్వింగ్ చెయిర్ విసురుగా గోవిందసామివైపు తిరిగింది.

రాజగోపాల్ వదనం గంభీరంగా, కందగడ్డలా ఎర్రగావుంది; చింతనిప్పుల్లా వున్నాయ్ కళ్ళు.

ఆయన చూపుల్లోని తీవ్రతకు భయకంపితుడై నించున్నాడు గోవిందసామి

“మి...స్ట...ర్ హె...డ్... క్లా...ర్క్ !...” అతి కర్కశంగా ధ్వనించింది ఆయన గొంతు. “ఏది గులక రాయో, ఏది వజ్రపు తునకో చెప్పే విద్య ఈ రాజగోపాల్ కు నేర్పకు!”...

“ఆడపిల్లలు పనిచేసే ఆఫీసులో చీడపురుగు ఉండటానికి వల్లకాదు. నిన్ను శంకరగిరి మన్యాలకు ట్రాన్సఫర్ చేస్తున్నాను. ఈ ఆఫ్టర్నూనే రెలీఫ్ !...వెళ్ళు...వూఁ.”

ఆయన ఉరుముకు గది ప్రతిధ్వనించింది.

వెన్నముక విరిగిన చీడపురుగు ఇహ విధిలేక, కదల్లేక కదల్లేక కదిలి, పడుతూ లేస్తూ, గడపవతల గిలగిలా తన్నుకుని, వెల్లకిలా పడిపోయింది.

